పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం

వికారాబాద్, సెప్టెంబర్ 3 : 2024-25 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు (ఫ్రెష్ , రెన్యూవల్)కు గానూ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 100% పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం (ఫ్రెష్, రెన్యూవల్) ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 3 నుంచి డిసెంబర్ 12, 2024 వరకు ఉందన్నారు. అదే విధంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థినీవిద్యార్థుల ఉపకార వేతనాల నమోదు ప్రక్రియ 100% జరిగేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల బ్యాంకు అకౌంట్ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ విషయాన్ని అందరూ గమనించి విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ (ఫ్రెష్, రెన్యూవల్) ఈ-పాస్ వెబ్‌సైట్ http://telanganaepass.cgg.gov.in నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న 2022-23 , 2023-24 విద్యా సంవత్సరాల పోస్ట్‌మెట్రిక్ హార్డ్ కాపీలు వికారాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో త్వరగా సమర్పించాలని ఆయన కోరారు.

తాండూరు నియోజకవర్గంలోని జుంటుపల్లి ప్రాజెక్టు అలుగుపారడంతో రోడ్డుపై పారుతున్న నీరు... వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

మట్టి గణపతులనే పూజిద్దాం..

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, సెప్టెంబర్ 3 : మట్టిని దేవునిగా చేద్దాం.. భక్తిని పూజగా అర్పిద్దామని , పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను వినియోగించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం పర్యావరణ విద్యా విభాగం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన మట్టి గణపతులనే పూజిద్దాం అనే గోడ ప్రతిని జిల్లా కలెక్టరేట్ అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయకులను బీసీ సంక్షేమ అధికారులతో కలిసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులనే పూజిద్దాం అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను నిర్మూలించే దిశగా మట్టిచే చేయబడ్డ గణనాథులను ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజకు వినియోగించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మట్టితో తయారుచేసిన వినాయకులను వా డాలని అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను సమన్వయంతో, భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మట్టి వినాయకులను వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్ , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఎస్ సురేశ్, జనరల్ మేనేజర్ మహేశ్వర్ పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించాలని గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఖమ్మంలో కాంగ్రెస్ గూండాల దాడి సిగ్గుచేటు

ఎన్ని దాడులు చేసినా ప్రజల పక్షానే పోరాడుతాం..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

వికారాబాద్, సెప్టెంబర్ 3 : ప్రజలను వరద సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండటంతో బాధితులను పరామర్శించడానికి, తగిన సాయం అందించి ధైర్యం చెప్పటానికి వెళ్తున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై ఖమ్మంలో కాంగ్రెస్ గూండాలదాడి సిగ్గు చేటని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం పట్టణంలో బొక్కలగడ్డ వరద బాధితుల వద్దకు వెళ్లిన మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, జగదీశ్ రెడ్డి, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావులతో పాటు అక్కడికి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , బీఆర్ఎస్ నాయకుల మీద కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు. ప్రజలకు సాయం చేయడం చేతగాక.. సాయం చేయడానికి వచ్చిన బీఆర్ఎస్ మాజీ మంత్రులపై , వారి వాహనాలపై రాళ్లతో దాడి చేయటం కాంగ్రెస్ పనికిమాలిన చర్య అన్నారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలనకు ఇది నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ దాడికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఇలాంటి ఎన్ని దాడులు చేసినా బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల పక్షాన ఉండి పోరాడుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

5న ఉద్యోగ మేళ

షాబాద్, సెప్టెంబర్ 3: రంగారెడ్డిజిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 5న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకు అడ్రస్ 6-3-456/4F/408.4th Floor, ఎంజీఆర్ ఎస్టేట్స్ మెట్రో పిల్లర్ నంబర్.116, పంజాగుట్ట, హైదరాబాద్ నందు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో రిటైల్, ఈకామర్స్, బీపీఓ రంగాల్లో ఉద్యోగాలు కలవని, విద్యార్హత పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 18-30 సంవత్సరాల లోపు ఉండాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9959684991/ 8977175394 నంబర్లకు సంప్రదించాలన్నారు.

షాబాద్ మండలం, మల్లారెడ్డిగూడలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంట

భారీ వర్షం..పాడైన పత్తిపంట

40 ఎకరాల్లో దెబ్బతిన్న పంట ..ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

షాబాద్, సెప్టెంబర్ 3: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తిపంట పూర్తిగా దెబ్బతిన్నది. షాబాద్ మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామానికి చెందిన రాపోలు బాల్‌రాజ్, సత్యనారాయణ, వెంకటయ్య, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మయ్య, గోపాల్, తదితరులకు సంబంధించిన సుమారు 40 ఎకరాల్లో పత్తిపంట పూర్తిగా ధ్వంసమైంది. ఆరుగాలం కష్టపడి పంట సాగుచేస్తే ఆకాల వర్షానికి పంట పూర్తిగా పాడైపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయశాఖ ఏఈఓకి సమాచారం అందించామని, పరిశీలించి తమకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి : కలెక్టర్

వికారాబాద్, సెప్టెంబర్ 3 : విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం యంగ్ ఓరేటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంత్ర, శిక్షా లోకం, భారత్ దేకో, అలోకిత్ సంస్థలు పాల్గొని మండల రిసోర్స్‌పర్సన్‌లు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని పా ఠ్యాంశాల బోధనతోపాటు ఆంగ్లంలో మాట్లా డే నైపుణ్యాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారంలో రెండు రోజులు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యంపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించారు. బోధించే సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు పూర్తిపట్టు ఉన్నప్పుడే విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని ప్రదర్శింపజేయాలని వివరించారు. యంగ్ ఓరేటర్స్ క్లబ్ నిర్వహిస్తున్న వర్క్‌షాపు ఉపాధ్యాయులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ వర్క్‌షాప్ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, నిర్వాహక ముఖ్యులు పవిత్ర, అభిజిత్‌తో పాటు సంస్థల సభ్యులు నీక్షిత్, మొహవిన్, యాన్నీ, ఎలిజిబెత్ పాల్గొన్నారు.

కొడంగల్ పెద్ద చెరువుకు లీకేజీ

వృథాగా పోతున్న నీరు.. పాటు కాలువ తెగి ఇండ్లు, పంటపొలాల్లోకి..

కొడంగల్, సెప్టెంబర్ 3 : మూడు రోజులుగా కురిసిన వర్షాలకు కొడంగల్ పెద్ద చెరువుకు భారీగా వరద నీరు వచ్చింది. అయితే..చెరువు కుక్కల తూం వద్ద లీకేజీ ఏర్పడి నీళ్లు వృథాగా పోతున్నాయి. అలాగే.. పట్టణ శివారులోని గాడిభావి శివాలయం వద్ద చెరువు పాటు కాలువ తెగిపోవడంతో నీళ్లు చెరువులోకి రాకుండా పంటపొలాలు, ఇండ్లలోకి చేరాయి. దీంతో చెరువులోకి నీరు రాకుండా వృథాగా పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నిండితే బోర్లలో నీటి నిల్వలు పెరిగేవని పేర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువు కుక్కల తూం మరమ్మతులకు నోచుకోక నీళ్లు వృథాగా పోతున్నాయని వాపోతున్నారు. సీఎం నియోజకవర్గం కావడంతో చెరువులు, కుంటలకు పూర్వ వైభవం వస్తుందని రైతులంతా ఆశతో ఉన్నామని, కానీ ఇటువంటి పొరపాట్ల వల్ల నీటి వృథా తప్పడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టి చెరువును కాపాడాలని స్థానికులు కోరారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరి చందన

బ్రిడ్జి, రోడ్ల పనులు మూడు నెలల్లో పూర్తి చేయండి

- నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టండి..
- దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలి..
- రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరి చందన

వికారాబాద్, సెప్టెంబర్ 3 : జిల్లాలో చేపడుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి.. పనులు పూర్తి చేయాలని రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపడుతున్న ఫ్లై ఓవర్ వే బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆర్‌అండ్‌బీ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ... జిల్లాలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, రోడ్ల పనులను వేగవంతం చేస్తూ మూడు మాసాల్లో పూర్తి చేయాలన్నా రు. నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకతవక లకు తావులేకుండా నాణ్యతను పాటించాలని అధికారులకు సూచించారు. నిర్మాణాలు చేపడుతున్న పనుల వివరాల నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆమె అధికారు లను ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా కాలినడక బాటల నిర్మాణ క్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిపై సం బంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా వికారాబాద్ పట్టణ కేంద్రంలో రూ.96 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను కలెక్టర్‌తో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, రోడ్లు భవనాలశాఖ ఇంజినీర్ ఇన్‌చీఫ్ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ వసంత నాయ క్, ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ రాంరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి పాడైన పంటలు, కూలిన ఇండ్ల పరిశీలన

మోమిన్‌పేట మండలంలో స్పీకర్ పర్యటన .. కూలిన ఒక్కో ఇంటికి రూ.3,200 పరిహారం

వికారాబాద్, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రజలకు ప్రాణ నష్టం, పెద్ద ఎత్తున ఆస్తి నష్టాలు వంటివి జరగలేదని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ నియోజకవర్గం, మోమిన్ పేట మండలంలో వర్షానికి పాడైన పంటలు, కూలిన ఇండ్లను జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి స్పీకర్ పర్యటించారు. కాసులాబాద్ చెరువు వాగుపై ఉన్న బ్రిడ్జిని, మల్‌రెడ్డి గూడలో కూలిన ఇంటిని పరిశీలించారు. రామనాథగూడ పల్లిలో నీటితో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జిని, పొలాలకు వెళ్ళే రోడ్డును, వెలిచాల్ గ్రామంలో కూలిన ఇంటిని పరిశీలించారు. గ్రామస్తులు, రైతులు, మహిళలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ... తుఫాను ప్రభావంతో రెండు రోజులు కురిసిన వర్షాలకు రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందన్నారు. వికారాబాద్ జిల్లాలో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో నష్టం జరిగిందన్నారు. అదృష్టవశాత్తు వికారాబాద్ నియోజకవర్గంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. వర్షానికి ఆరు ఇండ్లు కూలిపోయాయన్నారు. ప్రభుత్వ పరంగా కూలిపోయిన ఒక్కో ఇంటికి రూ. 3,200 లను అందిస్తామని హామీ ఇచ్చారు. నాలుగు పశువులు చనిపోయినట్లు వెటర్నరీ అధికారులకు సమాచారం అందిందని తెలిపారు.

రామనాథ్ గుడి పల్లి, మల్ రెడ్డిగూడ, గోవిందాపురం గ్రామాల పరిధిలో రైల్వే అండర్ బ్రిడ్జి , పొలాలకు వెళ్ళే రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా వాగులపై కత్వ ల సమస్యను రెండు, మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ప్రజలకు, రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పీకర్ వెంట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్డీవో వాసుచంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నా యకులు శంకర్ యాదవ్, సుభాశ్, మహేందర్ రెడ్డి, ఎజాస్ పటేల్, సిరాజుద్దీన్, మాణయ్య తదితరులు ఉన్నారు.

మోమిన్‌పేట మండలంలో ప్రజలతో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

జ్వరాలు వస్తే భయపడొద్దు..

- ప్రతి జ్వరం డెంగీ కాదు..
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వైద్య పరీక్షలు
- ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు

ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న మహిళతో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 3: జ్వరాలు వస్తే భయపడాల్సిన అవసరం లేదని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు ప్రజలకు సూచించారు. షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ దవాఖానకు వచ్చే రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సీజనల్‌లో జ్వరాలు రావడం సాధారణమని, వచ్చిన ప్రతి జ్వరాన్ని డెంగీ అనుకోవద్దన్నారు. సుమారు 4-5రోజులకు మించి జ్వరం ఉంటే పరీక్ష చేయించుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే పరీక్ష చేయించుకోవద్దని సూచించారు. డెంగీ ప్రమాదకరమైనప్పటికీ 90శాతం డెంగీ కేసులకు వైద్యం అవసరం లేకుండా పారాసెటమాల్ మాత్రలు, ద్రవ పదార్థాలు, ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. డెంగీ నిర్ధారణకు ఎన్ఎస్-1 ఎలిసా పరీక్ష చేయించుకోవాలని, దీని ద్వారా డెంగీ వచ్చిందా, లేదా అని తెలుస్తుందన్నారు. ప్లేట్‌లెట్స్ అనేవి ప్రతి జ్వరంలో తక్కువతుంటాయి.. దానికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్లేట్‌లెట్స్ డెంగీ జ్వరంతోనే పడిపోతాయనేది తప్పుడు వాదనన్నారు. 50వేల నుంచి 20వేల లోపు ఉన్నా మందుల ద్వారా చికిత్స పొందవచ్చునన్నారు. 20వేలలోపు ప్లేట్‌లెట్స్ తగ్గినప్పుడు రక్తం, ప్లేట్‌లెట్స్ ఎక్కించడం అనేది రోగిని బట్టి నిర్ణయించడం జరుగుతుందన్నారు.

ఇప్పటి వరకు డెంగీ 210 కేసులు

జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు డెంగీ 210 కేసులు, మలేరియా 3 కేసులు, చికెన్‌గున్యా 13 కేసులు వచ్చాయని వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. అదే విధంగా కలుషిత నీరు తాగడం, వంటలో వాడడం ద్వారా డయేరియా, వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, కలరా, కామెర్లు వస్తాయన్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు నీటిని వేడిచేసి తాగాలన్నారు. ప్రతి రోజూ జిల్లా వ్యాప్తం గా వసతి గృహాలను తనిఖీ చేయడం జరుగుతుందని, వసతిగృహాల్లో శానిటేషన్ ప్రకారం శుభ్రంగా ఉన్నప్పటికీ కూరగాయలు అపరిశుభ్రంగా ఉండడం గమనించడం జరిగిందన్నారు. కుళ్లిన కూరగాయలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఇప్పటికే వైద్య సిబ్బంది ఇంటింటికి జ్వరాల సర్వే చేయడం జరుగుతుందన్నారు. డెంగీ లక్షణాలు ఎముకలు, కంటి నొప్పులు ఉంటాయన్నారు. మున్సిపాలిటీలో, గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా అధికారులు చూడడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నీరు ఎక్కువగా నిలిచినచోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ దవాఖాన నిర్వాహకులు వ్యాధుల పేరుతో రోగులను భయపెడితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ దవాఖానలో వైద్యం అందించే సేవలకు సంబంధించిన ఖర్చులతో కూడిన వివరాల బోర్డులను తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ శ్రీనివాసులు, డీఎంఎన్‌హెచ్‌వో సీసీ సురేశ్, ఎంపీహెచ్‌వో శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యులు డుమ్మా..

- విధుల పట్ల ఇంత నిర్లక్ష్యమా.. సమయపాలన పట్టదా..
- షాబాద్ ప్రభుత్వ దవాఖాన ఆకస్మిక తనిఖీలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ ఆగ్రహం

షాబాద్ ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేసి.. హాజరుపట్టికను పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, సెప్టెంబర్ 3: వైద్యసిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ హెచ్చరించారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో ఇద్దరు డాక్టర్లకు గాను ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆగ్రహానికి గురయ్యారు. ఫార్మాసిస్ట్ కూడా విధులకు హాజరు కాలేదు. అసలు సమాచారం లేకుండా విధులకు డుమ్మా ఎలా కొడతారని ప్రశ్నించారు. అనంతరం సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో షాబాద్ దవాఖానను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, అయినా డాక్టర్లు సమయపాలన పాటించడం లేదని మండిపడ్డారు. ప్రసుత్తం కురుస్తున్న వర్షాలతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నందున.. ప్రభుత్వం వైద్యసిబ్బందికి సెలవులు రద్దు చేసిందని, అందుకు విరుద్ధంగా షాబాద్ లో ఇద్దరు వైద్యులు అనుమతి, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అర్హులైన వారందరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు అందించే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జ్వర సర్వే ద్వారా రోగులను గుర్తించి వారికి వైద్యసేవలు, మందులు అందించాలని చెప్పారు. ఆయన వెంట సిబ్బంది తదితరులున్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి

-డీఆర్‌డీవో శ్రీనివాస్

మర్పల్లి, సెప్టెంబర్ 3 : భూగర్భ జలాలు పెంపునకు కృషి చేయనున్నట్లు డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు.. మంగళవారం మండలంలోని కల్‌ఖోడా గ్రామంలో ఢిల్లీ నుంచి వచ్చిన బృందం సభ్యులు సుమిత్, మధుసూదనతివారీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్‌ఖోడా జీపీలో ఉన్న 2 వేల ఎకరాలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో ఏడాదికి రెండు పంటలు పండించే విధంగా చర్యలు తీసుకునే లాగా పనులు చేపట్టాలన్నారు.. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో కలిసి పనిచేయాలని అన్నారు.. మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌తో పాటు తెలంగాణలోని 8 రాష్ట్రాల్లో నీళ్లు లేని చోట వర్షపు నీళ్లు నిలుపుదల (స్టోరేజ్) చేసి పంటలు పండించేందుకు భూగర్భజలాలను పెంపొందించేందుకు పని చేస్తున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీవో రాజమల్లయ్య, పంచాయతీ కార్యదర్శి చందు, ఈసీ విఠల్, ఏపీవో అంజిరెడ్డి , గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్‌ఖోడాలో సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం